ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 29.0
కనిష్ఠం 23.0

ANDHRAJYOTHY
సూర్యాపేట
3
సోమవారం 9 సెప్టెంబరు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	588.70 (308.1702)	2,83,419	2,60,528
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.60 (3.60)	3,665	2,444
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	170.70 (39.36)	2,29,267	2,02,786

చికెన్ ధరలు	లైవ్ : రూ.125	డ్రెస్ : రూ.180	స్కిన్‌లెస్ : రూ.200


హైదరాబాద్‌లోని తన నివాసంలో గణపతి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే జగదీ్‌షరెడ్డి, కుటుంబసభ్యులు


హుజూర్‌నగర్‌లో కొలువుదీరిన గణనాథుడు

కొలువుదీరిన గణనాథుడు



జిల్లాలో గణనాథుడు కొలువుదీరాడు. తీరొక్క వినాయకుల ప్రతిమలను ప్రతిష్ఠించి ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. ఎక్కడ చూసినా వినాయక మండలపాల వద్ద సందడి నెలకొంది. భక్తి పాటలు, పూజారుల మంత్రోచ్ఛరణలు మార్మోగాయి. రాత్రివేళ వినాయక మండపాల వద్ద విద్యుత్ దీపాలు దేదీప్యమానంగా వెలిగాయి.వినాయకుడి తొలిపూజల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని నవరాత్రి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు.

ఒకే బోనం.. ఒకే గణపతి

- ఆదర్శంగా నిలుస్తున్న కేశవాపురం
- ఊరువారంతా ఆలయ నిర్మాణానికి దాతలే
- కులమతాలకతీతంగా భజన కార్యక్రమాలు
- ఐక్యంగా ముందుకెళ్తున్న గ్రామస్థులు



నల్లగొండ జిల్లాలోని మాడ్గుల పల్లి మండలం కేశవాపురం గ్రామస్థులు శ్రావణమాసంలో కలిసికట్టుగా ముత్యాలమ్మకి ఒకే బోనాన్ని సమర్పిస్తుంటారు. వినాయక చవితి కోసం చందాలు వసూలు గ్రామంలో ప్రధాన కూడలిలో ఒకే చోట ఒకే గణపతిని ఏర్పాటు చేశారు. వీధికో విగ్రహాన్ని పెట్టకుండా తామంతా ఒక్కటే అనే భావంతో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తుండటం గమనార్హం.

• 5లో..

రోజంతా ముసురు


నిండుకుండలా దర్శనమిస్తున్న అర్వపల్లి తీగల చెరువు


పేటలో కురుస్తున్న వర్షం

సూర్యాపేట, యాదాద్రి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి)/ మోతె, అర్వపల్లి, ఆత్మకూరు(ఎం): ఉమ్మడి జిల్లాలో శని, ఆదివారం వర్షం కురిసింది. యాదాద్రి జిల్లాలో ఆదివారం ఉదయం వరకు 0.9మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా అడ్డగూడూరు మండలంలో 8.5మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మోత్కురులో 2.0మి.మీ, యాదగిరిగుట్టలో 1.0, బొమ్మలరామారంలో 0.9, ఆత్మకూరులో 0.9, ఆలేరు మండలంలో 0.7, రామన్నపేటలో 0.4, మోటకొండూరులో 0.3 మి.మీ వర్షం కురిసింది. హైదరాబాద్‌లో కురుస్తున్న వర్షాలకు మూసీ నదికి వరద పెరిగింది. సూర్యాపేట జిల్లాలో ఆదివారం మొత్తం ముసురు కురిసింది. మునగాల మండలంలో వర్షాలకు రోడ్డు ధ్వంసమై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జిల్లా కేంద్రంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. అత్యధికంగా మోతె మండలంలో 35.1మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా తిరులగిరిలో 3.0మి.మీ వర్షం కురిసింది. జిల్లాలో 13.9మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. ఆత్మకూర్(ఎస్)లో 27.2మి.మీ, నడిగూడెంలో 26.7, చివ్వెంల, మునగాలలో 22.8, కోదాడలో 21.7, అనంతగిరిలో 21.5మి.మీ వర్షం కురిసింది. మోతె మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. మామిళ్లగూడెం నుంచి విభలాపురం వెళ్లే వాగు మూడు అడుగుల మేర ప్రవహిస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. అర్వపల్లి మండలంలో పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు నిండి అలుగుపోస్తున్నాయి. మండలంలో 70 కుంటలు, 35 చెరువులు పూర్తిగా నిండాయి. హుస్నేనాబాదలో పిడుగుపాటుకు ఓ ఆవు మృతిచెందింది. నల్లగొండ జిల్లాలో సైతం శని, ఆదివారం వర్షం కురిసింది. పలు ప్రాంతాలు జలమయమయ్యాయి.

సూర్యాపేట జిల్లాలో విద్యుత్‌శాఖకు రూ.10.01కోట్ల నష్టం

భానుపురి: సూర్యాపేట జిల్లాలో ఆదివారం వరకు కురిసిన వర్షాలకు రూ.10.01కోట్ల నష్టం వాటిల్లిందని విద్యుత్‌శాఖ ఎస్ఈ పాల్‌రాజ్ తెలిపారు. 4,461 విద్యుత్ స్తంభాలు, 140 కండక్టర్లు, 414 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని ఆయన తెలిపారు. 33 కేవీ ఎం-టైప్‌కు చెందిన 103 విద్యుత్ స్తంభాలు, 11కేవీకి చెందిన 1,656 స్తంభాలు, 2,702 ఎల్‌టీ స్తంభాలు దెబ్బతిన్నాయని వివరించారు. 11కేవీ స్తంభాలు 347, ఎల్‌టీ స్తంభాలు 355 మాత్రమే ఇప్పటి వర కు పునరుద్ధరించామని, మిగతా పనులు ముమ్మరంగా చేపడుతున్నామని తెలిపారు.


చెక్ డ్యాం వద్ద గంగమ్మకు పూజలు చేస్తున్న రైతులు

గంగమ్మ తల్లికి రైతుల పూజలు

ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని బిక్కేరు వాగులో నూతనంగా నిర్మించిన చెక్‌డ్యాంలోకి ఇటీవల కురిసిన వర్షాల కు వరద చేరడంతో ఆయకట్టు రైతులు గంగమ్మ తల్లికి ఆదివారం పూజలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ చెక్ డ్యాంలోకి నీరు రావడంతో భూగర్భ జలాలు పెరిగి వాగు చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ బావులు, బోర్లు సమృద్ధిగా నీరు వచ్చిందన్నారు. సకాలంలో చెక్ డ్యాం పూర్తి చేసి సాగునీరు అందించిన మంత్రికి, ఎమ్మెల్యేకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైతులు కోరె బీరయ్య, లక్ష్మీనర్సయ్య, బీరయ్య, మల్లయ్య, నర్సయ్య, వెంకన్న, కుమార్, మల్లేశం, కృష్ణ, పాండ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా పూజలు

వైభవంగా గిరిప్రదక్షిణ, కొండపై భక్తుల రద్దీ


గిరి ప్రదక్షిణను ప్రారంభిస్తున్న ఈవో భాస్కర్‌రావు

• 5లో..

రైతుల ఆశలకు గండ్లు


సాగర్ ఎడమకాల్వ పరిధిలోని ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు పడిన గండి (ఫైల్)

- ఎడమకాల్వ గండ్ల మరమ్మతులకు నిధులు మంజూరు
- నేటికీ ప్రారంభంకాని పనులు

సాగర్ ఎడమకాల్వ ఎంబీ కెనాల్ (ముక్త్యాల బ్రాంచ్ కెనాల్) ఆయకట్టు రైతుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఈ కెనాల్‌కు మూడు చోట్ల గండ్లు పడగా, నేటికీ మరమ్మతు పనులు ప్రారంభం కాలేదు. దీంతో 1.25లక్షల ఎకరాల ఆయకట్టు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అదేవిధంగా నడిగూడెం మండలం కాగిత రామచంద్రాపురం వద్ద ఎడమ కాల్వకు రెండు చోట్ల గండ్లు పడగా, ఈ పనులు సైతం నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు.

– హుజూర్‌నగర్, నడిగూడెం

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నాగార్జునసాగర్ ఎడమకాల్వ మొదటిజోన్‌లో ఉన్న ఎంబీ.కెనాల్‌కు మూడుచోట్ల గండ్లు పడ్డాయి. ఒకటి హుజూర్‌నగర్ మండలం కరక్కాయలగూడెం పరిధిలోని 14వ కిలోమీటర్ వద్ద గండిపడగా, పట్టణ పరిధిలోని రామస్వామి గట్టుకు సమీపంలో 18వ కిలోమీటర్ వద్ద కట్ట కోతకు గురికాగా, 22వ కిలోమీటర్ వద్ద రెండుచోట్ల గండ్లు పడ్డాయి. దీంతో లక్ష ఎకరాల పైగా నీరు అందించే ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. వానాకాలం నీటి విడుదలకు ముందురోజే సుమారు 16కిలోమీటర్ల దూరం రూ.18కోట్లతో ఆధునికీకరణ పనులు పూర్తయ్యాయి. ఈ పనులు నిర్వహించిన 22వ కిలోమీటర్ వద్ద రెండుచోట్ల గండ్లు పడ్డాయి. ఆధునికీకరణకు నోచుకోని 14వ కిలోమీటర్ వద్ద పెద్ద గండి పడింది. కాల్వకు కుడివైపు గండిపడడంతో వరద ఒక్కసారిగా మర్రిగూడెం ఫీడర్ ఛానల్ నుంచి బూరుగడ్డ నల్లచెరువుకు చేరుకొని చెరువుకట్ట తెగింది. దీంతో బూరుగడ్డ, గోపాలపురం, కర్కకాయలగూడెం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచాయి. పట్టణంలోని సింగారం రోడ్డులోని బట్టవారికంట చెరువు కట్ట, గోపాలపురం మోదుగుకుంట చెరువుకట్ట తెగింది. దద్దనాల చెరువు కారణంగా ఇక్కడి కాలనీలోని 300 ఇళ్లలోకి నీరు చేరింది. శివాలయం వీధిలోని చెరువు నుంచి వరద రావడంతో ఆ కాలనీలో 100 ఇల్లు నీట మునిగాయి. మట్టపల్లి బైపాస్ రోడ్డులో వందల ఎకరాలు వరదనీటిలో మునిగాయి. లింగగిరి పెద్ద చెరువు దిగువ భాగంలో పంటలు కొట్టుకుపోయాయి. వీటితో పాటు బూరుగడ్డ నుంచి ప్రవహించే వేమూలూరి వాగుకు ఇరువైపులా సుమారు 600 ఎకరాలు నీటమునిగాయి. వాగుకు రైతు లు ఏర్పాటు చేసుకున్న 90 మోటర్లకు పైగా తడిసి ముద్దయ్యాయి. సీతారాంపురం, అమరవరం, కరక్కాయలగూడెం, లక్కవరం, హుజూర్‌నగర్‌లో సుమారు 350 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి.


సాగర్ ఎడమకాల్వకు గండి కారణంగా నడిగూడెం మండలంలో వరి చేనులో ఇసుక మేటలు (ఫైల్)

ఎకరానికి రూ.30వేలు పరిహారం ఇవ్వాలి



వరదల కారణంగా నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30వేలు పరిహారంగా ప్రభుత్వం చెల్లించాలి. ఇసుక మేటలు వేసిన పొలాలను గుర్తించి ఎకరానికి రూ.50వేలు ఇవ్వాలి. వరదలతో రైతాంగానికి పెద్ద మొత్తంలో నష్టం జరిగింది. అధికారులు సమగ్ర సర్వే చేసి పరిహారం వెంటనే అందించాలి.

– పల్లె వెంకట్‌రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి

భారీ నష్టం

హుజూర్‌నగర్ మునిసిపాలిటీ, మండలంలోని 11గ్రామాల పరిధిలో సుమారు 13వేలఎకరాలకుపైగా నష్టం వాటిల్లింది. అధికారులు సుమారు 8వేల ఎకరాల్లో నష్టం వాటిల్లినట్టు అంచనా వేశారు. రైతుల పొలాల్లో ఇసుక మేటలు వేసింది. హుజూర్‌నగర్ డివిజన్‌లో వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం హుజూర్‌నగర్ మండలంలో 1,330 ఎకరాల్లో, గరిడేపల్లి 1,160, మఠంపల్లి 1,405, మేళ్లచెరువు 2,100, పాలకవీడు 200, చింతలపాలెం మండలంలో 1,160 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. వేపలసింగారం రోడ్డులోని బట్టవారికుంట తెగడంతో 500 ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నాయి. బూరుగడ్డ పెద్దచెరువు, నల్లచెరువుతో పాటు కరక్కాయలగూడెం లింగకుంట పరిధిలో 1,000 ఎకరాలకు పైగా నష్టం జరిగింది. 14వ కిలోమీటర్ వద్ద గండిపడిన ప్రదేశంలో ఒక్క హుజూర్‌నగర్ ప్రాంతంలో 1,000 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. హుజూర్‌నగర్ ప్రాంతంలో ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పరిధిలోని 1,800 ఎకరాలకు పైగా పంట నష్టం వాటిల్లింది.

ప్రారంభంకాని మరమ్మతు పనులు

నడిగూడెం మండల పరిధిలోని కాగిత రామచంద్రపురం వద్ద సాగర్ ఎడమకాల్వ 132, 133 కిలోమీటర్ వద్ద ఈ నెల 8న రెండు చోట్ల గండ్లు పడ్డాయి. దీంతో భారీగా పంట నష్టం వాటిల్లింది. ఖమ్మం, సూర్యాపేట జిల్లాల పరిధిలో కాగితరామచంద్రాపురం, నాయకన్‌గూడెం, మాధారం, మందనర్సయ్యగూడెం గ్రామాల్లో సుమారు 1,000 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. భారీ వరదలకు పంట పొలాల్లో ఇసుక మేటలు వేసింది. ఈ పొలాలు బాగుపడాలంటే కనీసం రెండు, మూడు పంటలు కోల్పోక తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎడమకాల్వకు గండ్లకు మరమ్మతు చేసేందుకు అత్యవసర పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2.10కోట్లు వేలు మంజూరు చేస్తూ ఈ నెల 5న పరిపాలన అనుమతులు జారీ చేసింది. ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఎన్నెస్పీ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. కాగా, పనుల ప్రారంభానికి వర్షాలు అడ్డంకిగా మారాయి. దీనికి తోడు కాల్వ కట్టలపై వాహనాలు వచ్చే పరిస్థితి లేదు. మరమ్మతులు చేసేందుకు భారీ వాహనాల్లో సామగ్రి తరలించాల్సి ఉంది. అయితే భారీ వాహనాలు వచ్చేందుకు కాల్వ కట్టలు అనుకూలంగా లేవని ఎన్నెస్పీ అధికారులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా, పనులు ఆలస్యమైతే సాగు చేసిన పంటలు కోల్పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం పది రోజుల్లో పనులు పూర్తయి ఎడమ కాల్వకు నీరు విడుదల చేస్తే పంటలు చేతికందుతాయని రైతులు పేర్కొంటున్నారు. ఎడమ కాల్వకు రెండు చోట్ల గండ్ల కారణంగా ఆయకట్టు పరిధిలో 42 ఎత్తిపోతల కింద ఉన్న 90వేల ఎకరాలు, మేజర్, మైనర్ కాల్వల కింద ఉన్న పంటలకు నీరందని పరిస్థితి ఏర్పడింది.

పూర్తిస్థాయిలో నివేదికలు సమర్పించాలి

జిల్లా ప్రత్యేక అధికారి అనితా రామచంద్రన్

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 8: ఇటీవల కురిసిన వర్షాలు, వరదల కారణంగా ఏర్పడిన నష్టంపై పూర్తిస్థాయిలో నివేదికలు సమర్పించాలని జిల్లా ప్రత్యేక అధికారి అనితా రామచంద్రన్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్‌తో కలిసి పంచాయతీరాజ్, నీటిపారుదల, వ్యవసాయశాఖ, మునిసిపల్, విద్య, వైద్య, విద్యుత్, రోడ్లుభవనాలు, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, డీడబ్ల్యూవో, డీటీడీవో శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆగస్టు, సెప్టెంబరు నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన ప్రతీ రైతు వివరాలు, ఇల్లు కూలిపోయిన బాధితుల వివరాలు, ప్రభుత్వ ఆస్తుల వివరాలు, రోడ్లు, విద్యుత్ ప్రాజెక్టుల వివరాలను ఆయాశాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మొత్తం దెబ్బతిన్న ఇల్లు, చెరువులు, మైనర్, మేజర్ ఇరిగేషన్ సంబంధించిన కాల్వల వివరాలను, ఆర్‌అండ్‌బీ, ఈఈపీఆర్, మునిసిపల్, వ్యవసాయ, విద్యుత్‌శాఖలకు సంబంధించిన పూర్తి నష్టం వివరాలపై ప్రతిపాదనలు పంపాలన్నారు. అంతకముందు జిల్లా ప్రత్యేక అధికారిగా నియమితులై తొలిసారి వచ్చిన అనితా రామచంద్రన్‌కు కలెక్టర్ తేజ్‌ఎనందలాల్ పవార్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్.లత, ఆర్డీవోలు వేణుమాధవరావు, సూర్యనారాయణ, శ్రీనివాసులు, సీఈవో అప్పారావు, మునిసిపల్ కమిషర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి అనితా రామచంద్రన్

రుణమాఫీపై స్పష్టత లేని ప్రభుత్వం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీ్‌షరెడ్డి

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 8: రైతులకు రూ.2లక్షల రుణమాఫీ విషయంలో ప్రభుత్వం రోజుకో మాట కాకుండా స్పష్టమైన వైఖరి వెల్లడించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీ్‌షరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సూర్యాపేటలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఒకలా, మంత్రులు మరోలా మాట్లాడుతున్నారని, దీంతో రైతులు గందరగోళానికి గురవుతున్నారని అన్నారు. పరిపాలనపై సీఎం, మంత్రులకు అవగాహన లేకపోవడంతో ఈ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రైతు రుణమాఫీపై తొలుత రూ.40వేల కోట్లని, ఆ తరువాత రూ.31వేల కోట్లని చెప్పి బడ్జెట్‌లో మాత్రం రూ.26వేల కోట్లు కేటాయించి, ఇప్పటి వరకు రూ.18వేల కోట్లు విడుదల చేశామని చెబుతున్నారని అన్నారు. రుణమాఫీకి ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.10వేల కోట్లు కూడా విడుదల చేయలేదన్నారు. బ్యాంకుల నుంచి సమాచారం తీసుకున్న ప్రభుత్వం మాఫీ రాని రైతులు వ్యవసాయశాఖాధికారులు, బ్యాంకర్లు, కలెక్టర్‌ను కలవాలని తప్పుడు సమాచారం ఇస్తూ మోసం చేస్తోందన్నారు. రైతుల ఓట్లతో అధికారంలోకి వచ్చి మళ్లీ మోసం చేయాలనుకోవడం చూస్తుంటే ఇంతకంటే దుర్మార్గమైన ప్రభుత్వం ఇంకోటి ఉండదన్నారు. విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారిందన్నారు. 2014కు ముందు రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితి ఏవిధంగా ఉందో ఇప్పుడు అదే పరిస్థితి ఉందన్నారు. సీఎం నుంచి మంత్రుల వరకు వ్యక్తిగత సంపాదనపై దృష్టి సారించారని, ప్రజలకు సేవలందించాలనే ఆలోచనే వారికి లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం రూ.2లక్షల వరకు రుణమాఫీ డబ్బు బ్యాంకులో జమ చేయాలని, ఆపైన రుణం పొందిన రైతులు ఎవరైనా ఉంటే వాటిని చెల్లిస్తారని అన్నారు. వానాకాలం పంటలు చేతికొచ్చే సమయం సమీపిస్తోందని, ఇప్పటికైనా రైతు భరోసా ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంలో నిర్లక్ష్యం వహించడం వల్లే వరద నష్టం ఎక్కువగా వాటిల్లిందన్నారు. ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, భద్రాద్రి-కొత్తగూడెం, ములుగు, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలో లక్షలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, వెంటనే పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. ఖమ్మంలో వరద బాధితులను ప్రతిపక్ష పార్టీ నాయకులు పరామర్శించేకు వెళ్తే దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఖమ్మంలోని వరద బాధితుల నివాసాల్లో గంట సమయం ఉండే దమ్ము మంత్రులకు ఉందా అని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ నాయకులు వై.వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, నెమ్మాది భిక్షం, జీడి భిక్షం, ఆకుల లవకుశ, తాహేర్‌పాష, దొంగరి యుగంధర్, జానీ యాదవ్, అనిల్‌రెడ్డి, జానకిరాములు, తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీ్‌షరెడ్డి

చికిత్సపొందుతూ శిశువు మృతి

- దేవరకొండ ప్రైవేట్ ఆసుపత్రిలో ఘటన
- ఆస్పత్రి ఫర్నిచర్ ధ్వంసం • మృతదేహంతో ఆందోళన

దేవరకొండ, సెప్టెంబరు 8: చికిత్స పొందుతూ ఐదు రోజుల శిశువు మృతి చెందాడు. ఇందుకు డాక్టర్ నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి ఫర్నిచర్ ధ్వంసం చేశారు. అనంతరం మృతదేహంతో బస్టాండ్ ఎదుట ధర్నా చేశారు. ఆదివారం నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలో ఈ ఘటన జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకా రం... డిండి మండలం ఎర్రారం సోమ్లాతండాకు చెందిన ఇస్లావత్ జ్యోతికి రెండో కాన్పు కోసం భర్త రమేష్, కుటుంబ సభ్యులు ఈ నెల 3వ తేదీన దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రి జ్యోతి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ నెల 6వ తేదీన బాలుడికి కామెర్లు రావడంతో అస్వస్థతకు గురయ్యాడు. అనారోగ్య సమస్యను తండ్రి రమేష్ వెంటనే డ్యూటీ డాక్టర్ బాబురాంకు తెలియజేశారు. వైద్యపరీక్షలు చేసిన డాక్టర్ బాలుడి పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన వైద్యం కోసం నల్లగొండకు తరలించాలని సూచించాడు. దీంతో ఆందోళన చెందిన రమేష్ కుటుంబ సభ్యులు ఈ నెల 6వ తేదీన బాలుడిని దేవరకొండ పట్టణంలో డాక్టర్ బాబురాం నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ నెల 7న బాలుడు మళ్లీ అస్వస్థతకు గురయ్యాడు. ఆదివారం ఉదయం డాక్టర్ బాబురాం బాలుడికి ఇంజక్షన్ చేసిన కొద్దిసేపటికే మృతి చెందాడు. దీంతో బాలుడు మృతికి డాక్టర్ బాబురాం నిర్లక్ష్యమే కారణమని బాలుడు తండ్రి రమేష్‌తో పాటు కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. అనంతరం బస్టాండ్ ఎదుట బాలుడి మృతదేహంతో రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న సీఐ నర్సింహులు సంఘటనా స్థలానికి చేరుకుని శిశువు తల్లిదండ్రులతో మాట్లాడారు. న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. రమేష్ దంపతులకు 2018లో ఆ దంపతులకు మొదటికాన్పులో ఆడశిశువు జన్మించింది. మళ్లీ ఏడేళ్లకు రెండో కాన్పులో బాలుడు జన్మించడంతో ఆ తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఏడేళ్ల తర్వాత పుట్టిన బాలుడు మృతి చెందడంతో దుఃఖసాగరంలో మునిగిపోయారు.



మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న బంధువులు, ఇన్‌సెట్‌లో శిశువు మృతదేహం

అవినీతి తుప్పు వదులుతోంది

» రూ. కోట్ల విలువైన యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ స్ర్కాప్ మాయం » రంగంలోకి దిగిన పోలీస్ బృందాలు » త్వరలో స్ర్కాప్ మాయగాళ్ల గుట్టురట్టు!



మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 8: నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలోని థర్మల్‌ప్లాంట్‌లో కొంత కాలంగా ఇనుము, అల్యూమినియం, ఇతర తుప్పు సామగ్రి గుట్టుగా బయటకు వస్తోంది. ఈ వ్యవహారంలో కాంట్రాక్టు సంస్థలో పనిచేసే ఉద్యోగులు, ఇంజనీర్లు సహకరించినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. దీంతో రెండు నెలల క్రితం వాడపల్లి పోలీసులు 10 మందిని అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రాజకీయ ఒత్తిళ్లు మొదలవడంతో పోలీసుల విచారణ అర్ధంతరంగా నిలిచింది. అనుమానాస్పదంగా పోలీసులకు చిక్కిన వ్యక్తులను పూర్తిస్థాయిలో విచారించకుండా నామినల్ కేసులు నమోదు చేసి విడుదల చేశారు. అయితే స్ర్కాప్ మాయం చేయడంలో గోదాం వద్ద విధులు నిర్వహించే ఓ అధికారి ప్రమే యం ఉన్నట్లుగా అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. మిర్యాలగూడ, హైదరాబాద్‌కు చెందిన బడా వ్యాపారులతో కొందరు చేతులు కలిపి దొడ్డి దారిన కాజేసి స్ర్కాప్‌ను అక్కడకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. అంతేకాకుండా కొందరు వ్యక్తులు అనూహ్యరీతిలో ఆర్థికంగా నిలదొక్కుకొని ట్రాన్స్‌పోర్టు వాహనాలను కొలుగోలు చేసినట్లుగా స్థానికంగా ప్రచారం జరుగుతోంది. తాజాగా మరోసారి స్ర్కాప్ మాయం కావడంపై పోలీసులకు ఉప్పందినట్లుగా తెలుస్తోంది. దీంతో కొన్నాళ్లుగా యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ స్ర్కాప్ కాజేస్తున్న వ్యక్తులను గుర్తించేందుకు పోలీసు బృందాలు రంగంలోకి దిగినట్లు సమాచారం.

మిర్యాలగూడ వ్యాపారి ప్రమేయం..?

మిర్యాలగూడ పట్టణంలో స్ర్కాప్ వ్యాపారం నిర్వహిస్తున్న ఓ వ్యక్తి యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ నుంచి అక్రమంగా తరలివస్తున్న స్ర్కాప్‌ను పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్న ప్రచారం జరుగుతోంది. తుప్పును తస్కరించి తీసుకువస్తున్న కొందరు వ్యక్తులతో పెరిగిన పరిచయాలు, ఈ దందాతో వస్తున్న లాభాలను పరిగణించిన సదరు వ్యాపారి ఇటీవల పట్టణ శివారులో ఓ స్ర్కాప్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లుగా తెలుస్తోంది. పట్టణ నడిబొడ్డున ఉన్న తన వ్యాపార కేంద్రంలో కొనుగోళ్లు చేస్తే ఎక్కడ దొరికిపోతానోనని జాగ్రత్తపడి రాకపోకలకు అనువుగా ఉండే చోట కొత్త వ్యాపార కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. స్ర్కాప్ చోరీ ముఠాకు థర్మల్ పవర్‌ప్లాంట్ ప్రధాన ద్వారం వద్ద విధులు నిర్వహించే సెక్యూరిటీ గార్డుల సహకారం ఏ మేరకు ఉందన్న కోణంలో అధికారులు లోతైన విచారణ కొనసాగుతోంది.

కొనసాగుతున్న విచారణ

యాదాద్రి థర్మల్‌పవర్‌ప్లాంట్‌లో కొంతకాలంగా చోరీకి గురవుతున్న స్ర్కాప్ వ్యవహారం ఓ కొలిక్కి వస్తున్నట్లుగా తెలుస్తోంది. వాడపల్లి, మిర్యాలగూడ పోలీసులు ఇటీవల చేపట్టిన వాహన తనిఖీల్లో ఐరన్ స్ర్కాప్ బయటపడింది. అనుమానాస్పదంగా అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా మిర్యాలగూడకు ఆటోలో తరలిస్తున్న స్ర్కాప్ యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌కు చెందినదిగా తేలినట్లు విశ్వసనీయ సమాచారం. తమకు చిక్కిన ఆధారాలతో పోలీసులు విచారణ ముమ్మరం చేసినట్లుగా తెలుస్తోంది. తీగలాగితే డొంక కదిలిన చందంగా స్ర్కాప్ మాయగాళ్ల బండారం ఒక్కొక్కటిగా బయటపడుతున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. ఇప్పటికే కోట్ల రూపాయల విలువైన సామగ్రి స్ర్కాప్ రూపంలో మాయమైనట్లుగా తెలుస్తోంది. ఈ వ్యవహారంలో సూత్రధారులు, పాత్రధారులను గుర్తించాల్సి ఉంది. ఆ కోణంలో పోలీసుల విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే సదరు వ్యక్తుల వివరాలు సైతం బయటపడే అవకాశం ఉన్నట్లు పోలీసులు వర్గాలు చెబుతున్నాయి.

కుక్కల దాడిలో 8మందికి గాయాలు

చండూరు, సెప్టెంబరు 8: వీధి కుక్కల దాడిలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన నల్లగొండ జిల్లా చండూరు చండూరు మునిసిపాలిటీ పరిధిలోని అంగడిపేటలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రధాన రహదారిపై వెళ్తున్న ప్రయాణికులతో పాటు అక్కడే ఉన్న చిన్నారులు మొత్తం ఎనిమిది మందిపై వీధి కుక్కలు గుంపుగా వచ్చి దాడి చేశాయి. అక్కడ ఉన్న వారు వాటిని తరిమివేశారు. దీంతో గాయపడిన వారిని చండూరు పీహెచ్‌సీకి తరలించారు. పట్టణ పరిధిలో కొన్ని నెలలుగా కుక్కలు దాడి చేసి గాయపరిచిన సంఘటనలు ఉన్నాయి. ఈ విషయమై పలుమార్లు మునిసిపాలిటీ అధికారులకు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకొని ప్రజలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ఒకే బోనం.. ఒకే గణపతి



కేశవపురం గ్రామంలో నెలకొల్పిన ఏక వినాయక విగ్రహం

ఉమ్మడి కుటుంబంలో ఒకరినొకరికి పడని ప్రస్తుత సమాజంలో ఒక గ్రామమంతా ఐక్యంగా ఉంటోంది. గ్రామంలో ఏ పనిచేపట్టాలన్నా కులమతాలకు, వర్గాలకతీతంగా ఉమ్మడిగా నిర్ణయాలు తీసుకుంటూ ముందుకెళ్తున్నారు నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కేశవాపురం గ్రామస్థులు. గ్రామంలో 109 కుటుంబాలు సుమారు 509 జనాభా ఉన్నారు. పురాతన కాలం నుంచి వస్తున్న ఆనవాయితీని కొనసాగిస్తూ గ్రామంలోని ప్రజలందరూ ఒకరినొకరు సహకరించుకుంటూ పనులు చేసుకుంటున్నారు. గ్రామంలో ఎక్కడా ఏ గొడవలు లేకుండా తామంతా ఒక్కటేననే నినాదంతో ముందుకు సాగుతున్నారు. ఈ గ్రామం గతంలో ఉమ్మడి కన్నెకల్ గ్రామపంచాయతీ పరిధిలో ఉండేది. పాలనా సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన నూతన మండలాల ఏర్పాటులో కేశవాపురం మాడ్గులపల్లి మండల పరిధిలోకి వచ్చింది. గతంలో నిడమనూరు మండలంలోని కన్నెకల్ గ్రామపంచాయతీ పరిధిలో ఉండే కేశవాపురం నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటైంది. కేశవాపురం ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటైనా గతంలో ఉన్న ఆనవాయితీని కొనసాగిస్తుంది.

\- మాడ్గులపల్లి



కేశవాపురం గ్రామంలోని రామాలయం.

- ఆదర్శంగా నిలుస్తున్న కేశవాపురం
- ఊరువారంతా ఆలయ నిర్మాణానికి దాతలే
- కులమతాలకతీతంగా భజన కార్యక్రమాలు
- ఐక్యంగా ముందుకెళ్తున్న గ్రామస్థులు

ఊరువారంతా ఆలయ నిర్మాణానికి దాతలే

కేశవాపురం గ్రామంలో గతంలో చిన్న రామాలయం ఉండేది. రామాలయం నిర్మించుకునేందుకు గ్రామస్థులందరూ ఒకచోట కూర్చొని ఇతరులపై ఆధారపడకుండా తలా కొంత నగదును పోగుచేసి రూ.38లక్షలు జమ చేసి 2021 సంవత్సరంలో రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసి కేవలం 8నెలల్లోనే రామాలయాన్ని పూర్తిచేసి ప్రారంభించారు. ఆలయానికి ఒక్కొక్కరు ఇచ్చిన విరాళాన్ని ఊరు వారంతా దాతలే అని బోర్డు పెట్టి తామంతా ఒక్కటేననే భావనను కలిగించారు.శ్రీరామనవమి, వినాయకచవితి, పీర్ల పండుగను కులమతాలకు అతీతంగా ఊరి ప్రజలంతా కలిసిమెలసి నిర్వహిస్తారు. అదేవిధంగా గ్రామంలో ముస్లింలు తక్కువగా ఉన్నా వారు అందరితోనూ కలిసి భజన, కోలాటంలో పాల్గొని మత సామరస్యాన్ని చాటుకుంటారు.

గ్రామంలో ఒకే బోనం - ఒకే గణపతి

శ్రావణమాసంలో వచ్చే పండుగల్లో బోనాల పండుగ ఒకటి. గ్రామాల్లో గ్రామ దేవతలకు పూజించాలనే కోరిక ప్రతి ఒక్కరికీ ఉంటుంది. ప్రతి ఇంట్లో బోనం చేసే ఈ రోజుల్లో కేశవాపురం గ్రామంలో మాత్రం ఊరికి ఒకే బోనాన్ని గ్రామ దేవతకు సమర్పిస్తుంటారు.గ్రామంలోని ఇంటింటికీ బియ్యం, నూనె,పసుపు, అగరబత్తీలను సేకరించి గ్రామంలోని సత్తెమ్మ అనే మహిళ ఇంట్లో బోనం ఏర్పాటు చేస్తారు. అనంతరం ఆమె బోనం ఎత్తుకోగా గ్రామస్థులందరూ డప్పు చప్పుళ్లతో ముత్యాలమ్మకు బోనం సమర్పిస్తారు. అదేవిధంగా వినాయక చవితి పండగ వచ్చిందంటే గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంటుంది. చందాలు వసూలుచేసి వీధికో విగ్రహాన్ని పెట్టేందుకు ఏర్పాట్లు చేస్తుంటారు. కానీ తామంతా ఒక్కటే అనే భావంతో కలిసి గ్రామంలో ప్రధాన కూడలిలో ఒకేచోట ఒకే గణపతి విగ్రహాన్ని ఏర్పాటుచేస్తారు. గణేష్ నవరాత్రుల పూజలు నిర్వహిస్తూ పలు గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామంలో 40ఏళ్లకు పైగా రామాలయం వద్ద గణపతి విగ్రహాన్ని పెట్టి నవరాత్రి పూజలు చేస్తున్నారు. గ్రామంలోని అన్ని కులాల పెద్ద మనుషులు పది రోజుల ముందే కమిటీని ఏర్పాటు చేసుకొని వినాయక చవితిని ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. గ్రామంలో వినాయకుని ఉత్సవాలకు గ్రామస్థులంతా కలిసి తమ పనులు పూర్తిచేసుకుని రాత్రి 11 గంటలవరకు ప్రతీ రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ఎలాంటి డీజే సంబంధిత పాటలు లేకుండా సంప్రదాయ పాటలు, భజన, కోలాటం వంటి సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తూ వారి భక్తిని చాటుకుంటున్నారు. గణేష్ నవరాత్రుల నిమజ్జనం కూడా ఎక్కడో సుదూర ప్రాంతాలకు వెళ్లి నిమజ్జనాలు చేయకుండా గ్రామానికి సమీపంలో ఉండే గంగన్నపాలెం గ్రామ చెరువులో స్వామి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తూ ప్రత్యేకత చాటుతున్నారు. అదేవిధంగా కార్తీకమాసంలో మాలధారణ స్వాములకు అన్నదానం నిర్వహిస్తుంటారు. కన్నెకల్ ఉమ్మడి గ్రామపంచాయతీలో ఉన్నప్పటి నుంచి అదే విధానం కొనసాగగా నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటైన తర్వాత కూడా ఐక్యతగా ఉంటూ ఒకే గ్రామం, ఒకే గణపతి విధానాన్ని కొనసాగిస్తున్నారు. ఈ విషయం తెలిసిన పలు గ్రామాల ప్రజలు కేశవాపురం గ్రామస్థులను ఆదర్శంగా తీసుకోవాలంటూ చర్చించుకుంటున్నారు.

పలు గ్రామాల్లో పరిస్థితి ఇలా ..

మండల పరిధిలోని పలు గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు విగ్రహాలను నిర్వాహకులకు అందజేస్తున్నారు. ఒకరినిమించి ఒకరు గ్రామాల్లో కొత్త తరహా విధానాలను అనుసరిస్తున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా డీజే సౌండ్‌లు, రాజకీయ పార్టీలకు పార్టీలకు సంబంధించిన పాటలను పెడుతూ దేవుడి మండపాల వద్ద రాజకీయ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. దీంతో ప్రశాంతంగా పూజలు నిర్వహించుకోవాల్సిన భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. దీనికి భిన్నంగా గ్రామంలోని ఒకే విగ్రహాన్ని నెలకొల్పి గ్రామస్థులంతా భజన, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ మేమంతా ఒక్కటే అనే కోణంలో ముందుకు వెళ్తున్న కేశవాపురం గ్రామం పలువురికి నిదర్శంగా నిలుస్తోంది.

గ్రామస్థులంతా కలిసిమెలిసి ఉంటాం



మా గ్రామంలోని ప్రజలందరం ఒకే మాట మీద నిలబడి కలిసిమెలిసి ఉంటాం. పండుగలను కులమతాలకు అతీతంగా నిర్వహించుకోవడం ఆనవాయితీ. కేశవాపురంలో 42 సంవత్సరాలుగా గ్రామస్థుల సహకారంతో గ్రామ పురోహితుడిగా ఉన్నాను. గ్రామస్థులంతా ఒకే తాటిపై ఉంటూ ఉత్సవాలను నిర్వహిస్తారు. గ్రామంలో ఒకే బోనం, ఒకే గణపతి విగ్రహాన్ని పెట్టుకొని పూజలు చేయడం ఎంతో ఆనందాన్నిస్తోంది.

\- దుర్గి శ్రీనివాస శర్మ, గ్రామ పురోహితుడు, కేశవాపురం

గ్రామస్థుల సహకారంతో గుడిని నిర్మించుకున్నాం

గ్రామంలోని ఆలయాలను గ్రామస్థుల సహకారంతో నిర్మించుకున్నాం. గ్రామంలో ఎలాంటి గొడవలు లేకుండా సంతోషంగా ఉంటున్నాం. ఏ సమస్య వచ్చినా ఉమ్మడిగా నిర్ణయాలు తీసుకొని పరిష్కరించుకుంటాం. మేమంతా ఒక్కటే అనే భావనలో ఉంటూ జీవిస్తున్నాం. దేవుడి దయ వల్ల ఇప్పటివరకు సమష్టిగా నిర్ణయాలు తీసుకోని ముందుకెళ్తున్నాం.

\- కనగంటి యాదగిరిరెడ్డి, గ్రామస్థుడు

ఉత్సవాల సమయంలో భజన, కోలాట కార్యక్రమాలు

వినాయక చవితి, దుర్గాష్టమి వివిధ ఉత్సవాల సమయంలో రాత్రయిందంటే చాలు గ్రామస్థులందరూ తమ పనులను ముగించుకొని రామాలయం వద్దకు చేరుకుంటారు. చిన్నాపెద్దా, ఆడమగా అనే తేడా లేకుండా భజన, కోలాట కార్యక్రమాల్లో పాల్గొని సందడి చేస్తారు. పురాతన కాలం నుంచి కోలాటం, భజనలు చేయడం ద్వారా గ్రామీణ కళలను భావితరాలకు అందించేందుకు కృషి చేస్తున్నామని గ్రామస్థులు పేర్కొంటున్నారు.



కేశవాపురం గ్రామంలో కోలాటం ఆడుతున్న మహిళలు.

క్వారీ గుంతలో వ్యక్తి గల్లంతు

వ్యవసాయ మోటార్ బయటికి తీసుకురావడానికి దిగిన వృద్ధుడు



క్వారీ గుంతలో గాలిస్తున్న గజఈతగాళ్లు (ఇన్‌సెట్లో) బానోతు హీరా

సూర్యాపేట, సెప్టెంబరు 8: వ్యవసాయ మోటార్ బయటికి తీయడానికి క్వారీ గుంతలోకి దిగిన వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండలం బొప్పారం గ్రామంలో శనివారం జరిగింది. ఆ వ్యక్తి కోసంక్వారీ గుంతలో పోలీసులు, గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బంది రెండు రోజులుగా గాలిస్తున్నా ఆచూకీ లభ్యం కాలేదు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మండలం కూడలి తండాకు చెం దిన బుక్య బిచ్యా బొప్పారంలో భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. సమీపంలోని క్వారీ గుంతలోని నీటిని మోటార్ ద్వారా సాగు నీటిగా వినియోగించుకుంటున్నాడు. ఇటీవల వరుసగా వర్షాలు కురవడంతో క్వారీ గుంతలోకి పూర్తిగా నీరురావడంతో, ఆ నీటిలో మోటారు మునిగింది. ఆ విద్యుత్ మోటార్‌ను బయటకి తీసేందుకు అదే తండాకు చెందిన బానోతు హీరా(60)ను బిచ్య కూలికి తీసుకువచ్చాడు. మోటారును బయటికి తీసేందుకు ఈ నెల ఏడో తేదీన మధ్యాహ్నం క్వారీ గుంతలోని దిగిన హీరా, నీటిలోకి మునిగి మోటార్‌కు తాడు కట్టాడు. మూడు నిమిషాలైన బయటికి రాకపోవడంతో క్వారీ ఒడ్డున బిచ్యతో పాటు ఉన్న మరో ఇద్దరు రైతులు తాడును లాగారు. మోటారు బయటికి వచ్చినా హీరా రాలేదు. హీరా క్వారీ రాళ్లలో ఇరుక్కుని ఉండవచ్చని పోలీసులకు బిచ్య సమాచారం ఇచ్చాడు. క్వారీ గుంత నుంచి హీరాను బయటికి తీసేందుకు డీఎస్పీ రవి, సీఐ, ఎస్ఐ సైదులు యత్నించినా గంతలోకి దిగడానికి ఎవరూ సాహసించలేదు. సీసీ కెమెరాల సాయంతో మూడు గంటల పాటు క్వారీ గుంతలో యత్నించినా హీరా ఆచూకీ లభ్యం కాలేదు. అగ్నిమాపక సిబ్బంది ఆదివారం క్వారీలోని నీటిని బయటికి తోడి గాలి పంపినా హీరా ఆచూకీ లభ్యం కాలేదు. క్వారీ నీటిలో ఆదివారం సాయంత్రం బ్లాసింగ్ చేసినా హీరా ఆచూకీ తెలియరాలేదు. హీరాను గుర్తించే పనులు కొనసాగుతున్నాయి.హీరాకు భార్య ఇద్దరు కుమార్తెలు ఇద్దరు కుమారులు ఉన్నారు.

రైతుపై దాడి: బానోతు హీరా ఆచూకీ తెలియకపోవడానికి బచ్యాయే కారణమని ఆరోపిస్తూ హీరా కుటుంబ సభ్యులు బిచ్యపై దాడి చేశారు. పోలీసులు వచ్చి బిచ్యా కుటుంబ సభ్యులు సముదాయించి పంపారు.

ఇదే గుంతలో రెండు నెలల క్రితం ముగ్గురి మృతి

ఈ క్వారీ గుంతలో ఈతకు దిగి రెండు నెలల క్రితం ముగ్గురు మృతి చెందారు. ఈ ఘటనను మరువక ఇదే గుంతలో మరో వ్యక్తి గల్లంతవ్వడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

వైభవంగా యాద 'గిరిప్రదక్షిణ'



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న ఈవో భాస్కరరావు, భక్తులు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 8: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం గిరిప్రదక్షిణ వైభవంగా చేపట్టారు. స్వామివారి జన్మనక్షత్రం (స్వాతి) రోజు గిరిప్రదక్షిణ చేయడం ఆనవాయితీ. వేకువజామున నుంచే కొందరు భక్తులు గిరిప్రదక్షిణ మొదలుపెట్టగా ఉదయం5.45గంటలకు వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ వైకుంఠద్వారం వద్ద ప్రత్యేక పూజలు చేసి హారతి ఇచ్చి ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు ఆలయ అధికారులతో కలిసి అధికారికంగా ప్రారంభించారు. కొండచుట్టూ రెండున్నర కిలోమీటర్ల మేర మొత్తం ఐదు వేల మంది భక్తులు స్వామిని తలచుకుంటూ ప్రదక్షిణ పూర్తి చేశారు. స్వామి జన్మనక్షత్రం సందర్భంగా ఆలయ ముఖమండపంలో వేకువజామున అర్చస్వాములు స్వాతి నక్షత్ర పూజల్లో భాగంగా 108కలశాలపై నూతన వస్త్రాలు కప్పి వాటిపై కొబ్బరికాయలు పేర్చి అందులో పవిత్ర నదీ జలాలు, పంచామృతాలు నింపి పంచసూక్త పఠనాలతో హోమం చేపట్టి ఉత్సవమూర్తులను, అలంకార మూర్తులను అభిషేకించి తులసీ దళాలతో సహస్రనామార్చనలు చేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించి 108 సువర్ణ పుష్పాలతో అర్చించారు. సాయంత్ర స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా స్వామిని దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

లక్ష్మీనృసింహులకు శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో లక్ష్మీనృసింహుడికి ఆదివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామి అమ్మవారిని మేల్కొలిపిన అర్చకస్వాములు గర్భాలయంలో కొలువుదీరిన స్వయంభువులకు అభిషేకం, సువర్ణ ప్రతిష్ఠామూర్తులతో పాటు స్వామిఅమ్మవారిని ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి సుదర్శన శతక పఠనాలతో హవనం చేపట్టారు. సాయంత్రం గజవాహనంలో ఊరేగింపు సేవలో వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. పాతగుట్టలోనూ సంప్రదాయరీతిలో నిత్య కైంకర్యాలు కొనసాగాయి. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు శైవాగమరీతిలో నిర్వహించారు.

యాదగిరికొండపై భక్తుల రద్దీ

యాదగిరికొండపై భక్తుల రద్దీ నెలకొంది. స్వాతి నక్షత్రం, సెలవు దినం కావడంతో మధ్యాహ్నం వరకు కొండపైన ఉభయ క్యూలైన్లు, తిరువీధులు భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 15వేల మంది భక్తులు స్వామివారిని దర్శించున్నారని ఆలయ అధికారులు తెలిపారు. బ్రేక్ దర్శనం, ఆరగింపు సమయంలో క్యూలైన్లు నిలిపివేసినందున ఆ తర్వాత కొద్దిగా రద్దీ పెరిగింది. ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల్లో వద్ద కూడా సందడిగా మారాయి. భక్తులను ఆర్టీసీ బస్సుల్లో కొండపైకి తరలించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.24,02,829 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

మలిదశ ఉద్యమకారుడు మృతి



నకిరేకల్, సెప్టెంబరు 8: తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు పాముకాటుతో మృతిచెందారు. ఆదివారం నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో ఈ ఘటన జరిగింది. గ్రామస్థులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం నకిరేకల్‌కు చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు యానాల లింగారెడ్డి(52) ఆదివారం ఉదయం తన నిమ్మతోటకు వెళ్లారు. అక్కడ వ్యవసాయ పనులు చేస్తుండగా పాముకాటుకు గురై అపస్మారకస్థితిలో పడిపోయాడు. ఈ నేపథ్యంలో అదే తోటకు పనికి వెళ్లిన కూ లీలు గుర్తించడంతో అప్పటికే ఆయన మృతి చెందాడు. 2010లో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ఆయన కీలకపాత్ర పోషించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో లింగారెడ్డి పలుసార్లు జైలు జీవితం గడిపారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చేంత వరకు నిరంతరం పోరాటం సాగించా రు. నకిరేకల్‌లో జరిగిన తెలంగాణ ఉద్యమంలో కీలకపా త్ర పోషించారు. తెలంగాణ ఉద్యమం కంటే ముందు ఆయన కమ్యూనిస్టు పార్టీలో పనిచేశారు. లింగారెడ్డికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. యానాల లింగారెడ్డి అంతిమయాత్రలో ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని లింగారెడ్డి పాడె మోశారు. అంతిమయాత్రలో తెలంగాణ ఉద్యమకారుడు చెరుకు సుధాకర్, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు కందాళ పాపిరెడ్డి, పూజార్ల శంభయ్య, పీసీసీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు చామల శ్రీనివాస్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రవీందర్,రాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

- 14 తులాల బంగారం, 15 తులాల వెండి ఆభరణాలు
- రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం
- నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి




వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కొలను శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం, సెప్టెంబరు 8: చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర నిందితులను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి 14తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి పట్టీలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శివరాంరెడ్డి వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్‌టీఆర్ జిల్లా కొండపల్లి గ్రామానికి చెందిన ఇట్ట గోపినాథ్, కృష్ణా జిల్లా మంగోలు గ్రామానికి చెందిన నిమ్మసత్తి గోపికృష్ణ ముఠాగా ఏర్పడి వివిధ గ్రామాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. వీరిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో మొత్తం 17 చోరీ కేసులను నమోదు కాగా చేసి కొన్ని రోజుల పాటు జైలులో శిక్ష కూడా అనుభవించారు. గోపికృష్ణ జైలు నుంచి విడుదలైన అనంతరం నెల్లూరు జిల్లాలో మూడు దొంగతనాలు, విజయవాడ, ఖమ్మం జిల్లా ముదిగొండలో ఒక చోరీ చేశాడు. తమకు దూర బంధువైన నిమ్మసత్తి గోపికృష్ణతో కలిసి తిరిగి దొంగతనాలు చేసేందుకు పథకం వేశారు. వీరిద్దరూ కలిసి నల్లగొండ జిల్లా కేతేపల్లిలో, సూర్యాపేట జిల్లా మాధవరం, మునగాల గ్రామాల్లో దొంగతనాలు చేసి దొరికిన బంగారు, వెండి ఆభరణాలను విజయవాడకు తీసుకెళ్లి వాటిని అమ్మి మార్గమధ్యలో తిరిగి దొంగతనం చేద్దామని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు జాతీయ రహదారి 65పై వెళ్తుండగా కేతేపల్లి వద్ద బస్సు దిగి తాళం వేసిన ఇళ్ల కోసం వెతుకుతుండగా ఆదివారం కేతేపల్లి పోలీసులు వారిని పట్టుకొని విచారించినట్లు తెలిపారు. వీరు చోరీలు చేసిన నేరాలను ఒప్పుకోగా మూడు కేసుల్లో దొంగిలించిన బంగారు, వెండి ఆభరణాలు (మూడు తులాల చంద్రహారం, రెండు తులాల బంగారు పుస్తెల తాడు, అరతులం చెవిదిద్దులు, ఒక్కటిన్నర తులాల బంగారు ఉంగరాలు, రెండు తులాల బంగారు గాజులు, రెండు బంగారు చైన్లు, అరతులం బంగారు మాటీళ్లు, రెండున్నర తులాల చైన్, 15 తులాల వెండి పట్టీలను) స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వీటి విలువ సుమారు రూ.10.50 లక్షలు ఉంటుందన్నారు. వారు తరలిస్తున్న ఆభరణాలను స్వాధీనం చేసుకొని ఫింగర్ ప్రింట్స్ చెక్ చేయగా గతంలో వీరు జైలుశిక్ష అనుభవించినట్లు గుర్తించామన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ ఆభరణాలు, నగదును జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. నిందితులను అరెస్టు చేసిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అభినందించారు. సమావేశంలో నకిరేకల్ రూరల్ సీఐ కొమిరెడ్డి కొండల్‌రెడ్డి, కేతేపల్లి ఎస్ఐ శివతేజ్, క్రైం పార్టీ కానిస్టేబుల్ అంజిరెడ్డి, రాంబాబు, సిబ్బంది ఉన్నారు.

గొర్రెల దొంగల అరెస్టు.. రిమాండ్

భువనగిరి రూరల్, సెప్టెంబరు 8: గొర్రెల దొంగతనానికి పాల్పడిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని శనివారం రిమాండ్‌కు పంపారు. భువనగిరి రూరల్ ఎస్ఐ వి. సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 5న యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం హన్మాపురం వాసి తోటకూరి చంద్రయ్యకు చెందిన 15గొర్రెలను గుర్తుతెలియని వ్యక్తులు గొర్రెల మంద నుంచి అపహరించుకుపోయారు. చంద్రయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. హన్మకొండ జిల్లా అయిలాపురం మండలం కొండపర్తి గ్రామానికి చెందిన రాయపురం నరేశ్, జనగాం జిల్లా లింగాల ఘణపురం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన దేవరాయ నరేశ్, మహబూబాద్ జిల్లా దోర్నకల్ మండలం చిల్కాడు గ్రామానికి చెందిన రుద్రక్షాల కాంతయ్య హైదరాబాద్‌లోని రామాంతపూర్‌లో నివాసమంటున్నారు. భువనగిరి, యాదగిరిగుట్ట మునిసిపాలిటీల పరిధిలో కుక్కలు పట్టుకుని జీవిస్తున్నారు. ఈ క్రమంలో భువనగిరి మండలం హన్మాపురం శివారులోని తోటకూరి చంద్రయ్య గొర్రెలపై కన్నేసి రాత్రి వేళలో మందలోకి చొరబడి వాహనంలో 15గొర్రెలను అపహరించుకుపోయారు. దర్యాప్తులో భాగంగా వీరిని రామాంతపూర్‌లో అదుపులోకి తీసుకుని విచారించడంతో నేరం అంగీకరించారు. గొర్రెలు అమ్మగా వచ్చిన రూ.29వేల నగదుతో పాటు వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకునేందుకు కృషిచేసిన ఎస్ఐ-టూ వీరస్వామి, క్రైం కానిస్టేబుల్ చెన్నకేశవులును ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, సీఐ ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఐ సంతోష్‌కుమార్ అభినందించారు.

ముశిపట్లలో భారీ కొండచిలువ




మోత్కూరు, సెప్టెంబరు 8: మోత్కూరు మండలం ముశిపట్లలో శనివారం పొలంలో భారీ కొండచిలువ కన్పించారు. రైతు చేబెల్లి మల్లయ్య పొలంలో వరి కోత యంత్రంతో వరి కోస్తుండగా బయటకు వచ్చింది. దానిని చూసి రైతులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే ఇరుగుపొరుగు రైతులను పిలిచి సుమారు ఆరుఅడుగులపైగా పొడవున్న కొండచిలువను కొట్టి చంపారు.

రోడ్డు ప్రమాదంలో గీత కార్మికుడు మృతి

ఆలేరు రూరల్, సెప్టెంబరు 8: యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కందిగడతండా శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గీత కార్మికుడు మృతిచెందాడు. కందిగడతండాకు చెందిన గీత కార్మికుడు చెక్కిళ్ల పరుశరాములు(63) శనివారం మధ్యాహ్నం కల్లు గీయడానికి తన బైక్‌పై వెళ్తున్న క్రమంలో 163వ జాతీయ రహదారిపై కందిగడతండా వద్ద హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తున్న కారు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పరుశురాములకు భార్య, కుమారుడు కుమార్తె ఉన్నారు.

తులసీ కాటేజీకి వెళ్లేందుకు తంటాలు



గుట్టలో భక్తులు చేరుకోవాల్సిన తులసీ కాటేజీలో అద్దె గదుల భవన సముదాయాలు

- అద్దె గదుల వరకు వెళ్లేందుకు బస్సులు కరువు
- పిల్లపాపలతో భక్తుల అగచాట్లు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 8: ఆధ్యాత్మిక క్షేత్రంగా రూపుదిద్దుకున్న యాదగిరికొండపై ఇష్టదైవాలను దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చే భక్తులు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడుస్తున్న ప్పటికీ స్థానిక ఆర్టీసీ డిపో అధికారులు బస్సులు అం దుబాటులోకి తేవడం లేదు. వివిధ ప్రాంతాల నుంచి యాదగిరిగుట్టకు వచ్చిన భక్తుల కోసం అద్దె గదులు ఉన్నా తులసీ కాటేజీకి చేరుకునేందుకు బస్సుల సదుపాయం లేక భక్తులు నానా అగచాట్లు పడుతున్నారు. స్థానిక పాతబస్టాండ్‌లో దిగినా ముందుగా అద్దె గదు ల కోసం వెతుకుతుంటారు. ఎదురుగా ఉన్న ఆండాల్ నిలయంలో గదులు లభించని పక్షంలో తులసీ కాటేజీకి వెళ్లాల్సిందే. కొత్త బస్టాండ్‌లో దిగిన చోట అద్దె గదులు అందుబాటులో లేక భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కుల సత్ర భవనాలు

ఇవి కాకుండా చుట్టుపక్కల కుల సత్ర భవనాలు వెలిశాయి. ఆర్యవైశ్య, క్షత్రీయ, మున్నూరు కాపు, వంజర, గౌడ, రెడ్డి కుల సత్రాలు ఇక్కడే ఉన్నాయి. వీటితో పాటు వైకుంఠద్వారం నుంచి తులసీ కాటేజీకి వచ్చే దారిలో సుమారు 10లాడ్జీలు అందుబాటులో ఉన్నాయి. అంతకుముందు కొండపైన కూడా అద్దె గదులు ఉండగా,ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా వాటిని తొలగించారు. దేవస్థాన అద్దె గదులతో పాటు కుల సత్ర భవనాలు ఉన్న ఈ ప్రాంతానికి బస్సులు నడపాలని పలువురు కోరుతున్నారు.

నేరుగా చేరుకోవాలంటే..

నిత్యం ఇక్కడి బస్సులు 16ట్రిప్పులు తిరుగుతుండగా, భక్తులు అధికంగా బస చేసే అవకాశమున్న తులసీ కాటేజీకి మాత్రం సర్వీసులు లేవు. ఆర్టీసీ బస్సులు వైకుంఠద్వారం నుంచి కుడి వైపు బదులు ఎడమ వైపు మళ్లించి కాటేజీ ప్రదేశంలో బస్టాండ్ ఏర్పాటు చేస్తే ఉపయోకరంగా ఉంటుంది. ఇక్కడకు చేరుకున్న బస్సులు నేరుగా గండిచెరువు మీదుగా కొత్త బస్టాండ్ చేరుకోవచ్చు. కిలోమీటర్లు తగ్గాలంటే అక్కడి నుంచి యూటర్న్ తీసుకొని తిరిగి వెళ్లొచ్చు. తులసీ కాటేజీ వరకు బస్సులు నడిపితే ప్రయోజనకరంగా ఉంటుందని భక్తులు కోరుతున్నారు.

మూడు సముదాయాలు ఇక్కడే..

తులసీ కాటేజీలో(లక్ష్మీ, నృసింహ, ఆండాళ్ సదనం) సుమారు 300 గదులు గల మూడు భవన సముదాయాలతో పాటు సుమారు 50అతిథి గృహాలు భక్తులకు అందుబాటులో ఉన్నాయి. బస్టాండ్ నుంచి సుమారు రెండు కిలోమీటర్ల మేర వెళ్లాల్సి ఉంటుంది. ఇక్కడకు రవాణా సదుపాయం లేక పిల్లపాపలు, వృద్ధులు, మహిళల అక్కడికి నడిచి వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తే ఎక్కువ డబ్బులు అడుగుతున్నారని భక్తులు వాపోతున్నారు.

బస్సులు తులసీ కాటేజీకి తిప్పడం వీలుకాదు

తులసీ కాటేజీకి బస్సులు తిప్పడం వీలుకాదు. బస్టాండ్ నుంచి కొద్దిపాటి దూరమే ఉన్నందున అటు వైపు బస్సులు వెళ్లడం లేదు. కిలోమీటర్లు పెరిగే అవకాశం ఉండడంతో డీజిల్, సిబ్బంది ఖర్చులు కూడా వచ్చేలా లేవు. లోకల్ సర్వీసులు తిప్పడం వీలుకాదు. బస్టాండ్ నుంచి వైకుంఠద్వారం మీదుగా కొద్ది దూరమే ఉన్నందున నడిచి వెళ్లొచ్చు. ప్రస్తుతం దేవస్థానం ఆధీనంలో బస్సులు నడుస్తున్నందున ఆలయ అధికారుల ఆదేశాల మేరకు తులసీ కాటేజీకి బస్సులు మళ్లిస్తాం.

\- ప్రవీణ్‌రెడ్డి, ఆర్టీసీ సీఐ, యాదగిరిగుట్ట.

కొండపైకి బస్సులు ఎలా వెళ్తుంటాయంటే

వివిధ ప్రాంతాల నుంచి బస్సులు ముందుగా పాత బస్టాండ్‌లో కొంతమంది, అక్కడ నుంచి కొత్త బస్టాండ్‌లో మరికొంతమంది దిగుతున్నారు. పాత బస్టాండ్‌లో దిగిన భక్తులతో వైకుంఠద్వారం మీదుగా యాదగిరిపల్లి, ప్రెసిడెన్షియల్ సూట్‌ల నుంచి కొత్త బస్టాండ్‌లోని భక్తులతో కొండపైకి చేరుకుంటున్నాయి. ఎక్కడ బస్సు దిగాలో భక్తులకు అర్థం కాక అయోమయానికి గురవుతూ తిరిగి అందరూ ఒకేచోట కలుస్తున్నారు. ఇదే సమయంలో అద్దె గదులు లభించే సమాచారం తెలియక తికమక పడుతున్నారు. పాత బస్టాండ్‌లో దిగిన భక్తులు కొండకు పడమర దిక్కులోని తులసీ కాటేజీకి చేరుకుంటుండగా కొండకు ఉత్తర భాగంలోని అద్దె గదులు లేని కొత్త బస్టాండ్ చేరుకున్న భక్తులకు అగచాట్లు తప్పడం లేదు.


కాసరబాదలో గణేష్ మండపం వద్ద పూజల్లో పాల్గొన్న భక్తులు

గణేష్ నవరాత్రోత్సవాలు శనివారం జిల్లా వ్యాప్తంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి మండపాలలో ప్రతిష్ఠించి పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మండపాల వద్ద భక్తులకు అన్నదానం చేస్తున్నారు.
● ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్


జిల్లా కేంద్రంలోని విద్యానగర్ 46వవార్డులో గణేష్ నవరాత్రి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జగదీ‌ష్‌రెడ్డి


సూర్యాపేటలో వినాయకవిగ్రహాన్ని తీసుకువెళుతున్న భక్తులు


సూర్యాపేటలో గ్రీన్‌క్లబ్ ట్రస్టు ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీదేవి



విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ఉండాలి


నాగారంలో గణపతి ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

సూర్యాపేట టౌన్, సెప్టెంబరు 8: సర్వవిఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 46వార్డులో ఏర్పాటు చేసిన వినాయకుడికి పూజలు చేసి మాట్లాడారు. అనంతరం పిల్లలతో కలిసి మండపం వద్ద సెల్ఫీలు దిగారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నిమ్మల శ్రీనివా‌స్‌గౌడ్, మునిసిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, అంగోతు బావ్‌సింగ్, మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయకచవితి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నా గణనాథులను భక్తులు వీధుల్లో ఊరేగిస్తూ మండపాల్లో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు,

పెన్‌పహాడ్: మండలంలోని 29 గ్రామ పంచాయతీలు, ఆవాస ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను నెలకొల్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యే పూజల్లో ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో 10 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఎన్జీవోస్ కాలనీలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీ సీఈవో నంద్యాల ప్రేమ్‌కరు‌ణ్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివా‌స్‌రెడ్డి,అంజయ్య, నాగేశ్వరావు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గరిడేపల్లి: గణేష్ నవరాత్రులను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్ఐ చలిగంటి నరేష్ కోరారు. గడ్డిపల్లిలోని టీవీ రూంలో వినాయకుడికి నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొని ఆయన మాట్లాడారు. వినాయక మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని రాత్రి 10గంటల తర్వాత లౌడ్ స్పీకర్లు పెట్టొదని సూచించారు. అనంతరం ఎస్ఐని యూత్ కమిటీ సభ్యులు సన్మానించారు.

నేరేడుచర్ల: పట్టణ, మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వాడవాడలా వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేసి నవరాత్రోత్సవాలను ప్రారంభించారు.

కోదాడ టౌన్: పట్టణంలో మునిసిపాలిటీ =ఆధ్వర్యంలో పట్టణంలో 600 మట్టి విగ్రహాలను భక్తులకు ఉచితంగా అందజేశారు.

తుంగతుర్తి: మండల కేంద్రంలోని శ్రీపట్టాభి సీతారామచంద్ర స్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో స్వామివారికి నిర్వహించిన పూజల్లో న్యాయవాది గుడిపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అర్వపల్లి: మాజీ ఉపసర్పంచ్ పులిచర్ల ప్రభాకర్ వినాయక విగ్రహం సమకూర్చడంతో పాటు 30కిలోల లడ్డు ఇచ్చారు. వీటిని ఊరేగింపుగా మండల కేంద్రంలోని శ్రీయోగనందలక్ష్మీనర్సింహస్వామి దేవాలయానికి తీసుకువచ్చి మండపంలో ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహించిన పూజల్లో ప్రభాకర్‌తో పాటు వేల్పుల రమేష్, సాయిని మనోహర్, వెంకటస్వామి, మామిడి శ్రీను, సంతోష్ పాల్గొన్నారు.

తిరుమలగిరి, మద్దిరాల, మద్దిరాల, నాగారం, నూతనకల్: తిరుమలగిరి మునిసిపాలిటీలో, మద్దిరాల, నాగారం, నూతనకల్ మండలాల్లో వినాయకచవితి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వినాయకులను ఊరేగింపుగా తీసుకువచ్చి మండపాల్లో ప్రతిష్ఠించి పూజలు ప్రారంభించారు. ఈ. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


హుజూర్‌నగర్‌లో వినాయక విగ్రహం ఊరేగింపు సందడి


సూర్యాపేట: మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య ఫెడరేషన్ సభ్యులు


గడ్డిపల్లిలో ఎస్ఐని సన్మానిస్తున్న యూత్ కమిటీ సభ్యులు


నూతనకల్‌లో గణేష్ మండపంలో పూజల్లో పాల్గొన్న భక్తులు


నేరేడుచర్ల కోదండరామాలయంలో గణపతి ఉత్సవాలు


కోదాడలో గణపతి ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు


అర్వపల్లిలో వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు


తిరుమలగిరిలో వినాయక పూజలో పాల్గొన్న యువకులు

పలువురికి ఎమ్మెల్యే జగదీ‌ష్‌రెడ్డి పరామర్శ

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 8: సూర్యాపేట పట్టణంలో పలు కుటుంబాలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. అనారోగ్యంతో మృతి చెందిన జర్నలిస్టు రాపర్తి కేశవులు, కాంగ్రెస్ నాయకుడు దారోజు జానకిరాములు, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రిటైర్డు ఉద్యోగి మాండన్ వీరన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అనారోగ్యానికి గురైన బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి బూర బాలసైదులుగౌడ్‌ను పరామర్శించారు. జగదీ‌ష్‌రెడ్డి వెంట పార్టీ నాయకులు వై. వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీనివా‌స్‌గౌడ్, నెమ్మాది భిక్షం, జీడి భిక్షం, బైరు వెంకన్నగౌడ్, కక్కిరేణి నాగయ్యగౌడ్, ఆకుల లవకుశ, తాహే‌ర్‌పాష, దొంగరి యుగంధర్, జానీ యాదవ్, అని‌ల్‌రెడ్డి, జానకిరాములు, ఎల్గూరి రాంబాబుగౌడ్, రఫీ తదితరులు ఉన్నారు.

రూ.3.20లక్షల విలువైన నిత్యావసరాల పంపిణీ

అనంతగిరి, సెప్టెంబరు 8: పాలేరు వాగు ఉధృతికి మండలంలోని కిష్టాపురం గ్రామంలో ఇళ్ల కోల్పోయిన బాధితులకు కత్రం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.3.20లక్షల విలువైన నిత్యావసరాలను పంపిణీ చేశారు. కత్రం అభిమన్యు శ్రీకాం‌త్‌రెడ్డి, పారిశ్రామికవేత్త కిరణ్‌కుమా‌ర్‌రెడ్డి ఆధ్వర్యంలో 160మందికి రూ.1500 విలువైన నిత్యావసర సరుకులు, రూ.500 విలువైన దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఈదుల క్రిష్టయ్య, పుల్లారెడ్డి, వెంపటి వెంకటేశ్వరరావు, ముస్కు శ్రీనివా‌స్‌రెడ్డి, నాగేంద‌ర్‌రెడ్డి పాల్గొన్నారు.

మిత్రుడికి రూ.50వేల ఆర్థికసాయం

చిలుకూరు, సెప్టెంబరు 8: భారీ వర్షాలకు మండలంలోని నారాయణపురం గ్రామంలో ఊర చెరువు కట్ట తెగి గ్రామానికి చెందిన ఎలుగూరి మోహ‌న్‌రావు ఇల్లు, ఎయిర్ కంప్రెషర్‌తో సహా పంక్చర్ షాపు కొట్టుకుపోంది. దీంతో తీవ్ర ఇబ్బంది పడుతున్న మోహ‌న్‌రావుకు ఆయనతో పాటు కలిసి చదువుకున్న 1997-98బ్యాచ్ పదో తరగతి స్నేహితులు ఆదివారం రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు రామయ్య, రాంబాబు, సైదులు, నారాయణ పాల్గొన్నారు.

వంట సామగ్రి అందజేత

కోదాడ రూరల్, సెప్టెంబరు 8: మండలంలోని తొగర్రాయి గ్రామంలో వరద బాధిత కుటుంబాలకు మధ్యాహ్న భోజన జిల్లా అధ్యక్షురాలు నర్సింగోజు గీత వంట సామగ్రిని ఆదివారం పంపిణీ చేశారు. వరదలకు గ్రామానికి చెందిన లక్ష్మి, ధనలక్ష్మి, సుకన్యల ఇళ్లు ధ్వంసమయ్యాయి. బాధితులకు వంట సామగ్రి, ఒక జత దుస్తులు, దుప్పట్లు, కూరగాయలను గీత ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, లైన్‌మన్ వీరబాబు, హేమ జ్యూవెలరీ యజమాని నాగయ్య, రఫీ, రమేష్, మనోజ్‌కుమార్, సందీప్ పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం

కోదాడ రూరల్, సెప్టెంబరు 8: వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసా‌ద్‌రెడ్డి, అమరనాయిని వెంకటేశ్వరరావు, ఇర్ల సీతారాంరెడ్డిలు అన్నారు. ఆదివారం మండలంలోని కూచిపూడి గ్రామంలో వరద బాధితులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేసి మాట్లాడారు.

వరద బాధితులను వెంటనే ఆదుకోవాలి

మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, సీపీఎం, సీఐటీయూ నాయకులు


కోదాడలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

కోదాడ, హుజూర్‌నగర్ రూరల్, మునగాల రూరల్, సూర్యాపేట సిటీ, సెప్టెంబరు 8: వరద బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం కోదాడలోని ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వరద బాధితులను ఆదుకోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల ప్రజలు తమ కన్నబిడ్డలు అని చెప్పిన ఉత్తమ్‌కుమా‌ర్‌రెడ్డి, పద్మావతి దంపతులు వర బాధితులను ఎందుకు ఆదుకోవటంలేదని ప్రశ్నించారు. మంత్రి ఉత్తమ్‌కుమా‌ర్‌రెడ్డి సీఎంతో మాట్లాడి వరద బాధితులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలిన,ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యులను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కోదాడ నియోజకవర్గంలో 16 వేల ఎకరాల్లో వరికి నష్టం జరిగిందని, రాజకీయాలకు అతీతంగా రైతులకు నష్టపరిహారాన్నిఅందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్‌కే నయీం, రామాచారి, భూపా‌ల్‌రెడ్డి, నాగరాజు, శ్రీనివాస్, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, భిక్షం, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలి: సీపీఎం

వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పోసన బోయిన హుస్సేన్ కోరారు. హుజూర్‌నగర్ మండలంలోని అమరవరం గ్రామంలో దెబ్బతిన్న పంటలను సీపీఎం నాయకులతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. చెరువులకు గండ్లు పడి వందలాది పంట చేలల్లో ఇసుక మేటలు వేశాయన్నారు. ప్రభుత్వం ఎకరానికి రూ.25వేల నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో దనయ్య శివ, సైదులు, సత్యనారాయణ, శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం అందించాలి

వర్షాలకు వరిపంటలు దెబ్బతిన్న రైతులను నష్టపరిహారం అందించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి డిమాండ్ చేశారు. మునగాల మండలంలోని గణపవరం వాగు వెంట మునిగిపోయిన వరి పైర్లను ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మోతె మండలం నామవరం నుంచి మఠంపల్లి మండలం యాతవాకిళ్ల వరకు సుమారు రెండే వేల ఎకరాల వరకు వరి పైర్లకు నష్టం వాటిల్లిందన్నారు. రైతుల విద్యుత్ మోటార్లు కూడా నీటిలో కొట్టుకుపోయాయన్నారు. ఇసుక మేటలు వేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 50 వేలు, నీట మునిగిన వరి పంటలకు రూ. 20 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కొలిశెట్టి యాదగిరిరావు దేవరం వెంకటరెడ్డి, చందా చంద్రయ్య, ఆరె రామకృష్ణారెడ్డి, స్టాలి‌న్‌రెడ్డి, సుంకర పిచ్చయ్య, జూలకంటి కొండారెడ్డి, జూలకంటి విజయలక్ష్మి, వెంకన్న, కృష్ణారెడ్డి, సతీష్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

సూర్యాపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో సుందరయ్య నగర్‌లో ఇళ్లు కూలిన వారిందరికీ ప్రభుత్వం ఇళ్లను నిర్మించి ఇవ్వా లని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం సూర్యాపేటలోని ఆ సంఘ కార్యాలయంలో మాట్లాడారు. సుందరయ్య నగర్ సమీపంలోని ఒక కంపెనీకి చెందిన ప్రహరీ కూలి పేదల ఇళ్లు ధ్వంసం అయ్యాయన్నారు. గాయపడిన బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు, ఉపాధ్యక్షుడు శ్రీను, సైదులు, వెంకట నారాయణ, ముత్యాలు, వెంకన్న, సైదయ్య పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు పేదలకు అండగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న కాల్వ సుజాత

హుజూర్‌నగర్, సెప్టెంబరు 8: ఆర్యవైశ్యులు పేదలకు అండగా ఉండాలని ఆసంఘం రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత కోరారు. ఆదివారం పట్టణంలోని వాసవీభవ‌న్‌లో నిర్వహించిన ఆవోపా వార్షిక సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య పేద విద్యార్థులకు రూ.4.50లక్షల విలువైన ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. అదే విధంగా 33మంది మహిళలకు పించన్లు, చీరలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్ ద్వారా ఆర్య వైశులకుసహకారం అందిస్తామన్నారు. అనంతరం సుజాతను సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వంగవీటి సతీష్, కుక్కడపు రాంమోహ‌న్‌రావు, గెల్లి అప్పారావు, ఓరుగంటి నాగేశ్వరరావు, వీర్లపాటి రమేష్, గాయత్రి, భాస్కర్, గీత, నరసింహారావు, గుండా రమేష్, చెన్నకేశవరావు, అయ్యప్ప, రూపేష్, , వెంకటేశ్వర్లు, జనార్దన్‌రావు, నరసింహరావు, నిమ్మల వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి పాటుపడతాం

అర్వపల్లి, సెప్టెంబరు 8: జాజిరెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి పాటుపడతామని పూర్వ విద్యార్థులు తీర్మానించారు. ఆ పాఠశాలలో40ఏళ్ల క్రితం ఆ పాఠశాలలో చదువుతున్న పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల అభివృద్ధితో పాటు శిథిలావస్థకు చేరిన తరగతి గదులను కూల్చి పునర్నిర్మించాలని తీర్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సామంతపూరి మురళి, బింగి శ్రీశైలం, కొమటి సోమయ్య, కొణతం పాపయ్య, వెంకట్, సత్యనారాయణ, నరేష్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



సూర్యాపేట టౌన్: గ్రామీణ తపాల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ నిరంతరం కృషి చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి బండి జయరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆసంఘం వార్షిక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆసంఘం సూర్యాపేట డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చలిగంటి పుల్లయ్య, కార్యదర్శిగా నాగరాజుతో పాటు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పోస్టల్ సూపరింటెండెంట్ వడ్లమూడి వెంకటేశ్వర్లు, కరుణాకర్, మిథున్, శ్రవణ్‌కుమార్, దివ్య, భిక్షం పాల్గొన్నారు.

చివ్వెంల: బాద్రపద మాస స్వాతి నక్షత్రం సందర్భంగా మండలంలోని ఉండ్రుగొండ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్నిఅర్చకులు చంద్రమాచార్యులు, కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణమోహన్, సభ్యులు పాల్గొన్నారు.

● చివ్వెంల మండలంలోని బద్యతండాకు చెందిన బానోతు దేవేందర్‌ను పాన్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డు వరించింది. సూర్యాపేటలోని మాంటెస్సోరి, నవోదయ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న దేవేందర్‌కు అవార్డును గుంటూరులో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అందజేశారు.

హుజూర్‌నగర్ రూరల్: టీపీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన మహేష్‌కుమా‌ర్‌గౌడ్‌ను హుజూర్‌నగర్‌కు చెందిన ఐఎన్‌టీ యూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న కలిశారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీ, ఎన్నెస్పీ క్యాంపు ప్రాంతాల్లో వినాయకుడి మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాన్ని మునిసిపల్ వైస్ చైర్మన్ సంపత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అనిల్, వంశీ, శ్రీను, వెంకన్న, రాము, వెంకటేశ్వర్లు, అంజయ్య, నాగయ్య, సాయి, రమేష్, వెంకటరెడ్డి, శివ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: భారీ వర్షాలు, వరదల కారణంగా వారం రోజులుగా చింతలపాలెం మండల కేంద్రానికి నిలిపివేసిన ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు చింతలపాలెం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉస్తెల నారాయణరెడ్డి, నాయకులు చింతిరాల రవి, అంకరాజు, పద్మ, వీరబాబు, అంకయ్య, హైమావతి తదితరులు పాల్గొన్నారు

నేరేడుచర్ల: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా స్కావెంజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, పట్టణ కార్యదర్శి రావుల సత్యం, చిలకరాజు శ్రీను పాల్గొన్నారు.

● గురు పూజోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేరేడుచర్లలోని రిటైర్డు ఉద్యోగుల భవనంలో రిటైర్డు ఉద్యోగులను లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ చల్లా ప్రభాక‌ర్‌రెడ్డి, నేరేడుచర్ల అధ్యక్షుడు జిలకర రామస్వామి సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు గు‌న్‌రెడ్డి సైదిరెడ్డి, యూసుఫ్, సుందరి నాగయ్య, కొణతం సీతారాంరెడ్డి, పోరెడ్డి శ్రీరాంరెడ్డి, విశ్వనాథ్, వెంకటరెడ్డి, సైదులు, శ్రీను, రంగారెడ్డి, లక్ష్మారెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

● వర్షాలతో దెబ్బతిన్న సాగర్ ఎడమ కాల్వలకు మరమ్మతులు చేసి వెంటనే సాగర్ నీటిని విడుదల చేయాలని డీసీసీబీ డైరక్టర్ దొండపాటి అప్పిరెడ్డి కోరారు. నేరేడుచర్లలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు, చెన్నబోయిన సైదులు, పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

పాలకవీడు: మండల కేంద్రంలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర బీసీ కార్పొరేషన్ ఎండీ బట్టు మల్లయ్యను బీఆర్ఎస్ నాయకుడు రాపోలు నవీన్ సన్మానించి పూల మొక్కను అందజేశారు. ఆయన వెంట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి, పెరుమాళ్ల సతీష్, తక్కెళ్ల నాగార్జున్ ఉన్నారు.

చిలుకూరు: చిలుకూరు మాజీ ఎంపీటీసీ, ఉస్మానియా యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి శ్రీనివాస్ మాతృమూర్తి నారమ్మ మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందింది. మండల కేంద్రంలో నిర్వహించిన నారమ్మ సంతాప సభకు ఓయూ మాజీ వైస్ చాన్సరల్ గోపా‌ల్‌రెడ్డి, లక్ష్మీకాంత్ రాథోడ్, మాజీ రిజిస్ట్రార్ కృష్ణారావు, ప్రొఫెసర్లు ఖాసిం, గోవింద్, ఓయూ చీఫ్ వార్డెన్ డాక్టర్ శ్రీనివాస్, డైరెక్టర్ ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, సొసైటీ చైర్మన్ అల్సకాని జనార్దన్, మాజీ సర్పంచ్ పారా సీతయ్య, వివిధ పార్టీల నాయకులు హాజరై నారమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

తిరుమలగిరి: గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతగా నిర్వహించుకోవాలని తిరుమలగిరి సీఐ రఘువీ‌ర్‌రెడ్డి కోరారు. ఆదివారం తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గణేష్ నిర్వాహణ కమిటీ సభ్యులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు గణేష్ మండపాల్లో డీజేలు పెట్టొద్దన్నారు. ఈ. కార్యక్రమంలో ఎస్ఐ కె.సురేష్ పాల్గొన్నారు.

మద్దిరాల: రైతుల సాయుధ పోరాట 76వ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కన్న చంద్రశేఖర్ కోరారు. మద్దిరాల మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. . ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు,మూరగుండ్ల లక్ష్మయ్య, శ్రీనివాస్, తొట్ల ప్రభాకర్ పాల్గొన్నారు.

మద్దిరాల: కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా మహేష్‌కుమా‌ర్‌గౌడ్‌ను నియమించడంపై గౌడ సంఘం మండల అధ్యక్షుడు కన్న వీరన్నగౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ కులస్థులకు అన్ని పార్టీల అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మెడెం వెంకన్న, జలగం అచ్చయ్య, ఆకుల ఉప్పలయ్య, తొనుకునూరి అశో‌క్‌గౌడ్, గుండ్ల నాగయ్య, తునికి మల్లయ్య, తాళ్లపల్లి కంట్లం, లింగరాజు, రేసు లింగయ్య, రాము పాల్గొన్నారు.

నాగారం: ఈ నెల 11వ తేదీ వరకు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ధార శ్రీనివాస్ కోరారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉన్నందున గణేష్ మండపాల్లో యువకులు, భక్తులు జాగ్రత్తగా ఉండాలన్నారు. వర్షాలతో కలిగి ఇబ్బందులను గ్రామస్థులు ఆయ పంచాయతీ కార్యదర్శిలకు ఫోన్‌లో తెలియజేయాలన్నారు.

తుంగతుర్తి: పీఆర్టీయూ తుంగతుర్తి మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా పాటి సుదీ‌ర్‌రెడ్డి పోతురాజు, చంద్రశేఖ‌ర్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో పీఆర్టీయూ తుంగతుర్తి మండల నూతన కార్యవర్గాన్ని 2024-26 విద్యా సంవత్సరానికి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా బాణాల సంతోష్ కుమార్, కార్యదర్శిగా ధరావత్ రఘుపతి, మహిళా ఉపాధ్యక్షురాలుగా బలుగూరి ఎలిజబెత్, మహిళా కార్యదర్శిగా మిరాయల శ్రీదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.